క్లుప్తంగా

కొనసాగుతున్న క్రీడా పోటీలు


కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

డిండి: డిండి మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో జోనల్‌స్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శిరీష, క్రీడల ఇన్‌చార్జ్ జ్యోతిర్మయి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

యూజీడీ పనుల పరిశీలన

మిర్యాలగూడ టౌన్ : పట్టణంలోని 20వ వార్డు రెడ్డికాలనీలో చేపడుతున్న భూగర్భ డ్రెయినేజీ (యూజీడీ) నిర్మాణ పనులను బుధవారం స్థానిక కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి చిలుకూరి బాలకృష్ణ పరిశీలించి మాట్లాడారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. వారి వెంట తాళ్ల వెంకట్‌రెడ్డి, జానకిరాంరెడ్డి, చిట్ల శ్రీనివాస్,సముద్రాల మధన్‌మోహన్, రాజు, శ్రీనివాస్, యాదిరెడ్డి, కిశోర్‌రెడ్డి ఉన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

వేములపల్లి (మాడ్గులపల్లి): రైతులకు ఇబ్బందులు కలిగించకుండా ధాన్యం కొనుగోళ్లు చేయాలని పీఏసీఎస్ చైర్మన్ జెర్రిపోతుల రాములుగౌడ్ కోరారు. బుధవారం ఆయన మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం రైతులకు రూ.2,850వరకు మద్దతు ధర అందించేలా కృషి చేసిందని పేర్కొన్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మిల్లుల నుంచి మద్దతు ధర రూ.2,320 కూడా ఇప్పించలేని పరిస్థితిలో ఉందన్నారు. కార్యక్రమంలో మారుతి వెంకట్‌రెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

డిండి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌ల మండల నూతన కమిటీని బుధవారం మండల కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్ల ఆంజనేయులు సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎన్.సీతారాంరెడ్డి, ఉపాధ్యక్షురాలిగా ఎస్.సుజాత, ప్రధానకార్యదర్శిగా వెంకటయ్య, కార్యదర్శిగా శ్రీనయ్య, కోశాధికారిగా లక్ష్మి, సలహాదారుడిగా గోపాల్‌తో పాటు నలుగురిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు


వెంకటంపేటలో సభ్యత్వ నమోదు పత్రం అందజేస్తున్న నాయకులు

చింతపల్లి: పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషిచేయాలని బీజేపీ జిల్లా కార్యదర్శి చనమోని రాములు కోరారు. బుధవారం మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో క్రియాశీలకంగా కార్యకర్త తయారైనప్పుడే పార్టీ బలపడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు మహేష్ గౌడ్, యువమోర్చా మండల ప్రధాన కార్యదర్శి, గజ్జ అభినవ్ ,చారి పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం


అన్నదానంలో పాల్గొన్న అయ్యప్పలు

త్రిపురారం : నిడమనూరు మండలంలోని ముకుందాపురం గ్రామ పరిసర ప్రాంత అయ్యప్ప మాలధారులకు వన్‌నేషన్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్, డీఎస్పీ నూకల వేణు గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వాములు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు పాల్గొన్నారు.

మణికంఠ స్వామికి ఘనంగా అభిషేకం


పూజల్లో పాల్గొన్న భక్తులు

కొండమల్లేపల్లి : కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రమౌళీశ్వర అయ్యప్ప స్వామి ఆలయంలో గురుస్వామి చిట్టిడు ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం మణికంఠ స్వామికి ఘనంగా అభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వామి భక్తులు గజ్జి లింగయ్య, శ్రీనివాస్, నరేష్, జబ్బు అంజయ్య, జయశంకర్, నరసింహ, భూతరాజు సత్తయ్య, ఆలయ పూజారి జయప్రకాశ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆయకట్టులో వరి కోతలు ముమ్మరం

- కూలీలు దొరకక రైతుల ఇక్కట్లు
- యంత్రాల కోసం పడిగాపులు
- అన్నదాతలను దోచుకుంటున్న వరికోత యంత్రాల దళారులు

హాలియా : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో వరి కోతలు ఊపందుకున్నాయి. ఈ ఏడాది వానకాలం సీజన్‌లో నియోజకవర్గ వ్యాప్తంగా సాగర్ ఆయకట్టు కింద సుమారు 96వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. వానాకాలం సీజన్ పంటచేతికి వచ్చే సమయంలో కూలీల దొరకక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. రోజురోజుకూ మారుతున్న వాతావరణ పరిస్థితులతో రైతుల్లో భయాందోళన నెలకొంది. వర్షం కురిసి పంట ఆగమవుతుందేమోనని రైతులు మనోవేదనకు గురవుతున్నారు. దీనికి తోడు పంట కోయడానికి కూలీలు దొరకక పోవడంతో ధాన్యం నేలరాలిపోతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల కూలీలు ప్రస్తుతం వ్యవసాయ పనులకు రాకుండా పత్తి కూళ్లకు వెళ్తుండడంతో ఆయకట్టు ప్రాంతాల్లో కూలీల సమస్య వేధిస్తోంది.

యంత్రాలకు భలే డిమాండ్

ఆయకట్టు ప్రాంతంలో కూలీల కొరత ఉండడంతో రైతులు వరికోత యంత్రాలను ఆశ్రయిస్తున్నారు.


వడ్లు కుప్ప పోస్తున్న వరికోత యంత్రం

రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వరికోత యంత్రాల దళారులు ధరలు పెంచారు. ఈ ప్రాంతంలో వరికోత యంత్రాలు లేకపోవడంతో దళారులు మహారాష్ట్ర, కర్నాటక వంటి దూర ప్రాంతాల నుంచి వరికోత యంత్రాలను అద్దెకు తీసుకొస్తున్నారు. కోతమిషన్ యజమానితో మధ్య దళారులు గంటల చొప్పున తక్కువకు మాట్లాడుకుని ఇక్కడ మాత్రం గంటకు రూ.3000 నుంచి రూ.3,200 మేరకు వసూలు చేస్తున్నారు. ఇందులో టైర్ల మిషన్‌కు ఒక రేటు ఉంటుంది. చైన్ యంత్రానికి మరో రేటు ఉంటుంది. టైర్ల మిషన్‌కు గంటకు రూ.1800 నుంచి రూ.2,200 వరకు వసూలు చేస్తుండగా, ఫోర్ వీల్ మిషన్‌కు గంటకు రూ.2,400 నుంచి రూ.2600 వసూలు చేస్తున్నారు. అదే విధంగా చైన్ మిషన్‌కు ఎక్కువ డిమాండ్ ఉండడంతో ఈ మిషన్‌కు మాత్రం రూ.3000 నుంచి రూ.3200 మేరకు డిమాండ్ చేస్తున్నారు. ఆయకట్టు ప్రాంతంలో వరిచేలు ఒకేసారి కోతకు రావడంతో యంత్రాలకు భలే డిమాండ్ పెరిగింది. కూలీల కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు యంత్రాల కోసం పడిగాపులు కాస్తున్నారు.

సమయానికి మిషన్లు దొరకడం లేదు



ఆయకట్టులో వరిచేలు ఒకేసారి కోతకు వస్తుండడంతో యంత్రాలకు బాగా డిమాండ్ పెరిగింది. వరి పంట కోసం దుకు కోత మిషన్ల కొరత ఏర్పడింది. సమయానికి కోత మిషన్లు దొరకడం లేదు. నాకున్న ఐదు ఎకరాల వరిచేను ఒకేసారి చైన్ మిషన్‌తో కోయడం వల్ల 9గంటల సమయం పట్టింది. గంటకు రూ. 3200ల చొప్పున మొత్తం రూ. 28,800లు కోత మిషన్‌కే ఖర్చు అయ్యింది.

–అనుముల శ్రీనివాస్‌రెడ్డి, రైతు, త్రిపురారం

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి


త్రిపురారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

త్రిపురారం : ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఇచ్చిన హామీ మేరకు సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ. 500 బోనస్ అందిస్తుందని తెలిపారు. నిడమనూరు మండలం రాజన్నగూడెం ఐకేపీ, త్రిపురారం ప్రాథమిక సహకార సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. రైతులు తొందరపడి దళారులను నమ్మి మోసపోవద్దని సూచించారు. వాతావరణ పరిస్థితులు మారుతుండడంతో కేంద్రాలకు వచ్చిన ధాన్యానికి వెంటనే కాంటాలు నిర్వహించి మిల్లుకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో కాంగ్రెస్ త్రిపురారం మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చిరెడ్డి, నిడమనూరు మార్కెట్ చైర్మన్ అంకతి సత్యం, వైస్ చైర్మన్ బుసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ ధనావత్ జయరాం నాయక్, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, తహసీల్దార్ గాజుల ప్రమీల, ఎంపీడీఓ విజయ కుమారి, ఏఓ పార్వతి చౌహాన్, బిట్టు రవి, అనుముల వెంకట్ రెడ్డి, పీబీ రవి, నరేందర్ పాల్గొన్నారు.

బాధితులకు పరామర్శ

నిడమనూరు మండలంలోని రాజన్నగూడెం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎదుళ్ల నర్సిరెడ్డి, బత్తుల చంద్రయ్య అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారి ఇళ్లకు ఎమ్మెల్యే వెళ్లి బాధితులను పరామర్శించారు.

రైతులను ఇబ్బందులకు గురిచేయొద్దు

- సబ్ కలెక్టర్ నారాయణ్ అమిత్


అధికారులు, రైతులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నారాయణ్ అమిత్

మిర్యాలగూడ : మిల్లర్లు రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా ఎప్పటికప్పుడు ధాన్యం దిగుమతి చేసుకోవాలని మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్ ఆదేశించారు. మిర్యాలగూడ మండల పరిధిలోని సాంబశివ రైస్ మిల్లులో బుధవారం ఆయన తనిఖీ నిర్వహించి మాట్లాడారు. ధాన్యం దిగుమతి చేసే సమయంలో రైతులకు మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేయాలన్నారు. లేనట్లయితే మిల్లులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కూడా తమ ట్రాక్టర్లను వరుస క్రమంలో ఉంచి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ హరిబాబు, ఆర్ఐ రామకృష్ణ, సత్యనారాయణ, డీటీసీఎస్ జావెద్ తదితరులు ఉన్నారు.

వాలీబాల్ పోటీలకు ఎంపిక


విద్యార్థిని రివెన్‌ను అభినందిస్తున్న టైం స్కూల్ డెరెక్టర్ నరేందర్‌రెడ్డి

హాలియా : పట్టణంలోని టైం స్కూల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని రివెన్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్స్ నులక రవీందర్‌రెడ్డి, మందా నరేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 4, 5, 6 తేదీల్లో సూర్యాపేటలో నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో నల్లగొండ జిల్లా జట్టు తరఫున తమ పాఠశాలకు చెందిన విద్యార్థిని రివెన్ పాల్గొని ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు వివరించారు. ఈనెల 16, 17, 18వ తేదీల్లో మెదక్ జిల్లాలో జరగబోయే రాష్ట్ర స్థాయి అండర్–14 వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని రివెన్‌ను పాఠశాల ప్రిన్స్‌పాల్ కత్తి కోటిరెడ్డి, పీఈటీ, ఉపాధ్యాయులు అభినందించారు.

ఇన్విజిలేటర్లకు బయోమెట్రిక్‌పై శిక్షణ

మిర్యాలగూడ: గ్రూప్–3 పరీక్షల ఇన్విజిలేటర్లకు బుధవారం పట్టణంలోని కేఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అభ్యర్థుల నుంచి బయోమెట్రిక్ తీసుకునే విధానంపై శిక్షణ తరగతులు నిర్వహించారు. తహసీల్దార్ హరిబాబు, పరీక్షల నిర్వహణ ఆర్‌సీ ఓ.వెంకటరమణ, టీజీపీఎస్‌సీ అధికారులు 56 మంది ఇన్విజిలేటర్లకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిబాబు మాట్లాడుతూ మిర్యాలగూడ పట్టణం, మండలంలో గ్రూప్ –3 పరీక్షలకు 28 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులందరూ నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు.


మాట్లాడుతున్న తహసీల్దార్ హరిబాబు

'మధ్యాహ్న' పథకానికి నిధులు కేటాయించాలని ధర్నా


అనుముల ఎంఈఓ కృష్ణమూర్తికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

హాలియా : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వడ్డించే మధ్యాహ్న భోజన పథకానికి నిధులు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి కోరే రమేష్, డివిజన్ అధ్యక్షుడు నల్లబెల్లి జగదీశ్ ప్రభుత్వాన్ని కోరారు. విద్యార్థులకు మిడ్డే మిల్స్ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బుధవారం అనుముల ఎంఈఓ కృష్ణమూర్తికి వినతి అందజేయగా, తిరుమలగిరి(సాగర్) తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్ నాగమణికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థు కు మధ్యాహ్న భోజన చార్జీలు పెంచకపోవడం బాధాకరమన్నారు.కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు నాగరాజు, కార్తీక్, పవన్, శ్రీకాంత్, వర్షిత్, రంగ, శివ, నవీన్, నాగు ఉన్నారు.

తడిచెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలి


మిర్యాలగూడలో చేత్త సేకరణను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ మహ్మద్ యూసుఫ్

సాక్షి ఎఫెక్ట్..

మిర్యాలగూడ టౌన్ : పట్టణ వాసులు తడి చెత్త, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బంది ఇవ్వాలని కమిషనర్ మహ్మద్ యూసుఫ్ కోరారు. తడి, పొడి చెత్త వేరుగా సేకరించాలన్న ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోందని 'అటకెక్కిన తడి, పొడి చెత్త సేకరణ' శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి కమిషనర్ స్పందించారు. ఉదయం ఆయన పట్టణంలో పర్యటించి సిబ్బంది చెత్త సేకరిస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం తడి, పొడి చెత్త వేరు చేయు విధానంపై పారిశుద్ధ్య కార్మికులు, పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. తడి,పొడి చెత్తను కలిపి ఇవ్వడం వలన కొంత సమస్య ఎదురవుతుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ తదితరులున్నారు.

నల్లచట్టాలకు వ్యతిరేకంగా 26న నిరసన

- ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్


సమావేశంలో మాట్లాడుతున్న నాగన్న గౌడ్

మిర్యాలగూడ టౌన్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నాలుగు నల్ల చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 26న రాష్ట్ర వ్యాప్తంగా జిల్లా కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహిచనున్నట్లు ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎరగాని నాగన్న గౌడ్ తెలిపారు. బుధవారం ఎన్ఎస్‌పీ క్యాంపులో గల ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్మికులకు మేలు కలిగే చట్టాలను కాకుండా బీజేపీ ప్రభుత్వం నాలుగు నల్ల చట్టాలను తీసుకువచ్చిందని ఆరోపించారు. నిరసన ప్రదర్శనలో కార్మికులు భారీగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో ఐఎన్‌టీయూసీ నాయకులు పరికే వెంకటేశ్వర్లు, చాంద్‌పాష, నూకపంగ నాగయ్య, వంటి పాక విక్రం, రాములు, రమేష్, మతీన్, వీరయ్య, విజయ్, సైదులు, బుచ్చిబాబు, ఖలీల్, సత్యనారాయణ తదితరులున్నారు.

వేతనాలు చెల్లించాలని ఎమ్మెల్యేకు వినతి

త్రిపురారం : వేతనాలు చెల్లించానలని కోరుతూ పంచాయతీ కార్మికులు బుధవారం మండల కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఐదు నెలలుగా వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ఎమ్మెల్యేకు వివరించారు. తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే అక్కడే ఉన్న త్రిపురారం ఎంపీడీఓ విజయకుమారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులను ఇబ్బందులకు గురిచేయకుండా సకాలంలో వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో మండల గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం అధ్యక్షుడు దేవోజు సురేష్, కార్మికులు పాల్గొన్నారు.

గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి


కల్వపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ నాగమణి

వేములపల్లి(మాడ్గులపల్లి): గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పోషకాహారాన్ని తీసుకుని ఆరోగ్యంగా ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమణి సూచించారు. మాడ్గులపల్లి మండలంలోని కల్వలపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం నిర్వహించిన పోషణ్ అభియాన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యమిస్తే అంటురోగాలు ప్రబలవన్నారు. అనంతరం చిట్యాల మమత సైదులు దంపతుల కుమార్తె వేదశ్రీకి అన్నప్రాసన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు నాగయ్య, ఉపాధ్యాయురాలు సరిత, అంగన్‌వాడీ టీచర్లు లెంకల కల్పన పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని ధర్నా


రోడ్డుపై బైఠాయించిన ఏబీవీపీ నాయకులు

దేవరకొండ: బాసర ట్రిపుల్ ఐటీలో ఇటీవల ఆత్మహత్య చేసుకున్న విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని ఏబీవీపీ నాయకులు యలమల గోపిచంద్ కోరారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని ప్రధాన రహదారిపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థిని మృతి విషయం తెలుసుకున్న ఏబీవీపీ నాయకులు పరామర్శకు వెళితే అక్కడ ఉన్న యూనివర్సిటీ అధికారులు దాడికి పాల్పడడం బాధాకరమన్నారు. బాసర ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న ఆత్మహత్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు.అంతే కాకుండా విద్యార్థి సంఘం నాయకులపై దాడికి పాల్పడిన సెక్యూరిటీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రేమ్, ఆసిఫ్, అష్రఫ్, భాను, శివ, ప్రవీణ్, తదితరులున్నారు.

ఆర్థికసాయం అందజేత

పెద్దవూర: చిన్నతనంలో పాఠాలు బోధించిన మండలంలోని ఏనెమీదిగూడెం గ్రామానికి చెందిన వెంకటయ్య ఆర్థిక ఇబ్బందులు తెలుసుకుని పూర్వ విద్యార్థులు అతని పిల్లల చదువులకు బుధవారం రూ.30వేల ఆర్థికసాయం అందించారు. నాటి ఉపాధ్యాయుడు వెంకటయ్య పిల్లలు మండల కేంద్రంలోని శాంతినికేతన్ గురుకుల పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నారు. వారికి ఫీజులు కట్టే స్తోమత లేని పరిస్థితిని తెలుసుకుని గత విద్యా సంవత్సరంలో రూ.30వేలు చెల్లించగా, ఈ యేడాది సైతం స్కూల్ ప్రిన్సిపాల్ నడ్డి ఆంజనేయులకు ఫీజుల నిమిత్తం రూ.30వేలను అందించారు. ఇద్దరిలో ఒకరికి పాఠశాల యాజమాన్యం ఉచితంగా విద్య నందిస్తోంది. కార్యక్రమంలో నాటి గురువు వెంకటయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు శ్రీరమణ, వెంకట్‌రెడ్డి, ఏడుకొండలు, యాదగిరిరావు, నాగరాజు, కృష్ణారెడ్డి, మాధవరెడ్డి, సీతారాం, సుధాకర్‌రావు పాల్గొన్నారు.


నగదు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

సింగరాజుపల్లి రిజర్వాయర్ పనుల పరిశీలన


రిజర్వాయర్ పనులను పరిశీలిస్తున్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ తదితరులు

డిండి: డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా మండలంలో నిర్మిస్తున్న సింగరాజుపల్లి రిజర్వాయర్ పనులను బుధవారం దేవరొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ పరిశీలించారు. పనుల వివరాలను ఇరిగేషన్ ఈఈ శ్రీధర్‌రావును అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని సంబంధిత కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట మాజీ జెడ్పీటీసీ దేవేందర్‌రావు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొందినేని వెంకటేశ్వరరావు, గడ్డబీది సాయి, భద్యా నాయక్, లింగమయ్య తదితరులున్నారు.

ఎమ్మెల్సీ సీటు బీసీలకు కేటాయించాలి


సమావేశంలో మాట్లాడుతున్న తిరుమలగిరి అశోక్

మిర్యాలగూడ టౌన్ : త్వరలో జరగనున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీసీలకు అవకాశం కల్పించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక బీసీ హాస్టల్‌లో జరిగిన యువజన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ, ఖమ్మం, వరంగల్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ సీటును బీసీలకు కేటాయించాలని కోరారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా పూర్తిగా వెనుకబడిపోయారని పేర్కొన్నారు. సమావేశంలో ఎర్రబెల్లి గంగాధర్, కిరణ్, అనిల్, సైదులు, శంకర్, రమణ, ఉపేందర్ తదితరులున్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కును అందిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పెద్దవూర: నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వరంలాంటిదని హాలియా ఏఎంసీ చైర్మన్ తుమ్మలపల్లి చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పులిచర్ల గ్రామానికి చెందిన సత్యనారాయణకు రూ.21వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించి మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స చేయించుకోగా ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.21వేలను మంజూరు చేయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ లక్ష్మయ్య, నాయకులు హర్జానాయక్, బొడ్డుపల్లి అంజనేయులు, రామలింగం పాల్గొన్నారు.

గర్భకోశ వ్యాధి నివారణ మందులు పంపిణీ

పెద్దవూర: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని పర్వేదుల గ్రామంలో పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి గర్భకోశ వ్యాధి నివారణ మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల పశు వైద్యాధికారి డాక్టర్ నులక నాగార్జున్‌రెడ్డి మాట్లాడుతూ దీర్ఘకాలికంగా గర్భం దాల్చని పశువులను గుర్తించి వాటికి పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్ నడ్డి బాలరాజు, గోపాలమిత్ర కల్లూరి మధుసూధన్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


మందులు పంపిణీ చేస్తున్న డాక్టర్ నాగార్జున్‌రెడ్డి

సంక్షిప్త సమాచారం


పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన

చింతపల్లి: మండల పరిధిలోని ధైర్యపురి తండాలో ఆత్మహత్య చేసుకున్న వాంకుడోత్ రోజా కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ మృతురాలి బంధువులు బుధవారం చింతపల్లి పోలీస్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేశారు. ఇదే గ్రామానికి చెందిన కళ్యాణ్ కుటుంబ సభ్యుల వేధింపులు భరించలేకనే వాంకుడోత్ రోజా ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. మృతురాలికి ఐదు, మూడేళ్ల కుమారులు ఉన్నారని పేర్కొన్నారు. మృతురాలి కుటుంబానికి పరిహారం అందించాలని కోరారు. న్యాయం చేస్తామని నాంపల్లి సీఐ నవీన్‌కుమార్ హామీతో ఆందోళన విరమించారు. చింతపల్లి, మర్రిగూడ, మల్లేపల్లి ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

ఇటుక బట్టీల పరిశీలన

చింతపల్లి: మండల పరిధిలోని నసర్లపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన ఇటుక బట్టీలను బుధవారం మైనింగ్ ఏఈ బాలు పరిశీలించారు. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు ఇటుక బట్టీలను పరిశీ లించినట్లు ఏఈ తెలిపారు. మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ అధికారుల అనుమతులతో బట్టీలను నిర్వహించాలన్నారు. ఆయన వెంట ఆర్ఐ సునీత, ఇతర రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వే


మిర్యాలగూడ : సర్వే ఫారంపై సంతకం చేస్తున్న మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి


నిడమనూరులో సర్వేను పరిశీలిస్తున్న సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి

మిర్యాలగూడ టౌన్ : అంతటా సమగ్ర కుటుంబ సర్వే ముమ్మరంగా కొనసాగుతోంది. బుధవారం స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి క్యాంపు కార్యాలయానికి ఎన్యూమరేటర్లు వెళ్లి వివరాలు నమోదు చేసుకున్నారు. మిర్యాలడగూడ పట్టణం, మండలాల్లో జరిగే సర్వేలో ఆర్‌ఓ జ్ఞానేశ్వరీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, ఆర్ఐ భాణావత్ సత్యనారాయణ, ఏఎస్‌ఓ రవీందర్‌రెడ్డి ఉన్నారు.

త్రిపురారం : నిడమనూరు, త్రిపురారం మండలాల వ్యాప్తంగా గ్రామాల్లో ప్రభుత్వం ఆధ్వర్యంలో సమగ్ర కుటుంబ సర్వే కొనసాగుతుంది. బుధవారం సాగర్ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి, నిడమనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం పలు గ్రామాల్లో సర్వేను పరిశీలించారు.

చందంపేట : చందంపేట మండలంలోని పొగిళ్ల, ముడుదండ్ల గ్రామాల్లో బుధవారం ఇంటింటి సర్వే కొనసాగింది. తహసీల్దార్ శ్రీనివాస్ ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేసి సర్వే ఫారాలను పరిశీలించారు. సర్వే వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.